జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/









## దేశానికి 'కూల్ క్యాపిటల్'గా ఆంధ్రప్రదేశ్: మంత్రి లోకేశ్

శ్రీసిటీలో ఇప్పటివరకు 70,000 ఉద్యోగాలు, వాటిలో 50శాతం మహిళలకే వచ్చాయని వ్యాఖ్య

2028 నాటికి దేశంలోని 80శాతం ఏసీలు ఏపీలోనే తయారీ లక్ష్యమన్న మంత్రి

యువత కోసం మే చివరిలో 'నైపుణ్యం' పేరుతో ఏఐ ఆధారిత స్కిల్ పోర్టల్

రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడి

# 'తమిళనాట' సస్పెన్స్ థ్రిల్లర్

గంట గంటకూ మారిన రాజకీయ సమీకరణలు

విజయ్‌కు సీఎం కుర్చీ దక్కకుండా ద్రవిడ పార్టీల అనూహ్య ఎత్తుగడ !

బద్ధవ్యతిరేక డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పొత్తు !!

అంతా వట్టిమాటలే అంటూ కొట్టేసిన ప్రధాన పార్టీలు



చెన్నై: వందకు పైగా స్థానాల్లో గెలిచిన టీవీకే చీఫ్ విజయ్ మరో డజనుమంది ఎమ్మెల్యేల మద్దతుతో ఖచ్చితంగా సీఎం కుర్చీపై కూర్చుంటారని అంతా భావిస్తున్న వేళ తమిళనాట పెను సంచలనాల పర్వానికి తెరలేచింది. గంట గంటకూ ఊహించని మలుపులతో అధికార పీఠం చివరికి ఎవరి పరమవుతుందో ఎవరూ చెప్పలేని అనూహ్య పరిస్థితి ఏర్పడింది. కలలో కూడా ఊహించనట్లుగా బద్ధ వ్యతిరేక డీఎంకే, అన్నాడీఎంకేలు ఏకమైపోయి సీఎం కుర్చీని తన్నుకుపోతాయన్న వార్త ఇప్పుడు యావత్ తమిళనాట సంచలనం సృష్టిస్తోంది. బయటి ఎమ్మెల్యేల మద్దతుతో ఎలాగోలా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయొచ్చని గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు ఊహించని పరిణామాలు ఒకదాని వెంట మరోటి వచ్చిపడి ఊపిరాడనివ్వట్లేవు. అధికారమే పరమావధిగా మీ రెండు పార్టీలు పొత్తు పెట్టుకోబోతున్నాయా అన్న ప్రశ్నకు డీఎంకే, అన్నాడీఎంకేలు 'లేదు'అనే సమాధానిస్తున్నాయి. కానీ రహస్యంగా రెండు పార్టీల మధ్య విస్తతస్థాయిలో మంతనాలు జరుగుతున్నాయని తమిళనాడు మీడియాలో వార్తలు షికార్లుచేస్తున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే ఉమ్మడిగా వచ్చి ప్రభుత్వం ఏర్పాటుచేస్తామంటే గవర్నర్ అర్లేకర్ సరేనంటారా

## మెట్రో ఫేజ్--2కు ఆమోదం తెలపండి

- ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉండాలి
- ఎయిర్‌పోర్ట్--ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్--3 కింద చేపట్టండి
- ఇప్పటికే డీపీఆర్ సమర్పించామని వెల్లడి
- కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్--2కు ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్--2 సమగ్ర ప్రణాళికను

## రైతులకు వేగంగా విత్తన సరఫరా చేయాలి

మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్

పంటలకు ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా అధిక ఆదాయం

వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్ల అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష



ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని



# రైతు డిక్లరేషన్ ..ఓ బోగస్ పత్రం

రైతులను వంచించిన రేవంత్, రాహుల్

రైతు భరోసా ఎకరాకు 15 వేలు ఎందుకు ఇవ్వడం లేదు

కాంగ్రెస్‌కు పిండం పెడితేనే..రైతులకు న్యాయం

బిఆర్ఎస్ హయాంలో ఠంచనుగా రైతుభరోసా ఇచ్చాం

రైతు సంగ్రామ సదస్సులో కెటిఆర్ విమర్శలు





వరంగల్,మే: రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరిట రైతులకు చిత్తు కాగితం ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని సూచించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా అని అడిగారు. రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. అన్ని పంటలు బోనస్ ఇచ్చి కొంటామన్నారని గుర్తుచేశారు.

## ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

విధులకు ఏళ్లుగా గౌర్హాజరు

51 మందిపై వేటు వేసిన ప్రభుత్వం

క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న మంత్రి సత్యకుమార్



## అధికారం దక్కలేదనే కేటీఆర్ ఆక్రోశం

ప్రజలు అసహ్యించుకునేలా ఆయన వ్యాఖ్యలు

రైతు పేరుతో రాజకీయ డ్రామా..బీఆర్ఎస్ అసలు రంగు బయటపడింది

రైతు సంగ్రామ సదస్సు కాదు... బీఆర్ఎస్ ఆక్రోశ సభ: మంత్రి పొంగులేటి

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..

# కేరళ సీఎం పదవిరేసులో ముగ్గురు!

(మొదటి పేజీ తరువాయి)

లెఫ్ట్ కూటమి పరిపాలనా కోటగోడలను బద్దలుకొడుతూ పదేళ్ల తర్వాత కేరళలో అధికారపీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎట్టకేలకు కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధంచేసుకుంది. అయితే రాష్ట్రపరిపాలనా రథాన్ని ముందుండి నడిపించే రథసారథి ఎవరనే చర్చ ఇప్పుడు మొదలైంది. గతంలో కేరళ రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్షనేతగా ఉండి సీఎం పినరయి విజయన్ ప్రభుత్వ వైఫల్యాలను విజయవంతంగా ఎండగట్టిన వీడీ సతీశన్‌కు సీఎం అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఊహాగానాలు ఎక్కువయ్యాయి. దఅయితే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహిత నేతగా మెలుగుతున్న కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చునే ఆస్కారముందని కాంగ్రెస్ శ్రేణుల్లో పెద్ద చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేశ్ చెన్నితల సైతం సీఎం రేసులో ముందుకు దూసుకుపోతున్నారని కేరళ మీడియా కోడైకూస్తోంది. పార్టీ నేతలందర్నీ సమన్వయం చేసే సత్తా, పరిపాలనా అనుభవం, ఢిల్లీలో మాట నెగ్గించుకురాగల పరపతి ఉన్న నేతకే సీఎం పదవి దక్కే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురిలో ఎవరిని సీఎం పదవి వరిస్తుందనేది కేరళలో చర్చనీయాంశమైంది. ఈ ముగ్గురు కీలకనేతల గురించి క్లుప్తంగా..

# 9న బెంగాల్‌లో బీజేపీ తొలి సర్కారు

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ యవనికపై భారతీయ జనతా పార్టీ తన తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. మే 9న కోల్‌కతాలోని చారిత్రక 'బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్'వేదికగా, నవ శకానికి నాంది పలుకుతూ కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మే 9న ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. బెంగాల్ సాంస్కృతిక అస్తిత్వానికి నిదర్శనమైన రవీంద్రనాథ్ టాగోర్ జయంతి (మే 9 -- 25వ వైశాఖం) రోజు ప్రమాణ స్వీకారం జరగనుండటం విశేషం. తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే సస్పెన్స్ ఇంకా వీడలేదు. సువేందు అధికారి పేరు ప్రధానంగా వినిపిస్తుండగా, సమిక భట్టాచార్య, సుకాంత మజుందార్, స్వపన్ దాస్‌గుప్తాల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. 'భూమిపుత్రుడి'కే పట్టాభిషేకం చేయాలన్నది బీజేపీ కేంద్ర నాయకత్వం ఆలోచనగా కనిపిస్తోంది. సుమారు 250 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన, కోల్‌కతా నడి'డ్డున ఉన్న 'రైటర్స్ బిల్డింగ్స్'తిరిగి రాష్ట్ర సచివాలయంగా రూపుదిద్దుకోనుంది. మమతా బెనర్జీ హయాంలో హూగ్లీ నది అవతలి ఒడ్డున నిర్మించిన 'నబన్నా'నుంచి పరిపాలన సాగగా, ఇప్పుడు అధికార పగ్గాలు చేపట్టిన బీజేపీ ప్రభుత్వం, తిరిగి పాత సచివాలయం నుంచే పాలన అందించాలని నిర్ణయించింది. రైటర్స్ బిల్డింగ్స్‌లో మరమ్మతులు పూర్తయ్యే వరకు, కొత్త ముఖ్యమంత్రి అసెంబ్లీ ఆవరణలోని 'అనెక్స్ బిల్డింగ్'నుంచి పాలనను నిర్వహించే అవకాశం ఉంది.

# రైతు డిక్లరేషన్ ..ఓ బోగస్ పత్రం

(మొదటి పేజీ తరువాయి)

కౌలు రైతులకు ఎకరానికి రూ.14వేలు వస్తుందా అని ప్రశ్నించారు. పంటబీమా పథకం ఎక్కడకు పోయిందని అడిగారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఎప్పుడిస్తారన్నారు. దుక్కిదున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు.డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు.

# ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 51 మంది వైద్యులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారు. శాశ్వత ఉద్వాసనకు గురైన 51 మందిలో బోధనాసుపత్రులకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు 8 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 41 మంది, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలగించిన వారిలో కొందరు ఏడేళ్ల నుంచి, మరికొందరు ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉంటూ సొంత వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్-1964 ప్రకారం ఏడాదికి మించి విధులకు గైర్హాజరైతే రాజీనామా చేసినట్లుగానే పరిగణించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనల మేరకు వీరికి ముందస్తుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఏడాదిలోపు గైర్హాజరీలో ఉన్న మరో 33 మంది వైద్యులు ఇందులో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఛార్జిమెమోలు జారీ చేశారు.

# రైతులకు వేగంగా విత్తన సరఫరా చేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు.మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి అన్నారు.

# మెట్రో ఫేజ్--2కు ఆమోదం తెలపండి

రూపొందించి ఇప్పటికే డీపీఆర్‌ను సమర్పించినట్లు తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్--2, ఫేజ్--3పై చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ లో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఫేజ్--2, ఫేజ్--3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశంతో మెట్రో ఫేజ్--1ను ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్‌ఎల్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఫేజ్--2ను భారత ప్రభుత్వం -- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ -- భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్--3గా చేపట్టాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను కూడా ఇప్పటికే సమర్పించామని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్వీఎస్ రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్‌కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాగంగా కేరళలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఓడించామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీకి వచ్చిన ఆయన విమానాశ్రయంలో విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు స్పందించారు. 'కేరళలో కాంగ్రెస్ విజయం సాధించింది. అక్కడ రాహుల్, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేలు నరేంద్ర మోదీ, అమిత్‌షాలను ఓడించారు. వాళ్లకు అక్కడ ఒక్క స్థానం మాత్రమే దక్కింది. అదీ వాళ్ల పనితీరు..'అంటూ ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు.

# దేశానికి 'కూల్ క్యాపిటల్'గా ఆంధ్రప్రదేశ్: మంత్రి లోకేశ్

ఏపీని దేశంలోనే కీలక పారిశ్రామిక హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, త్వరలోనే రాష్ట్రాన్ని 'భారతదేశపు కూల్ క్యాపిటల్'గా తీర్చిదిద్దుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ప్రముఖ ఏసీ తయారీ సంస్థ 'క్యారియర్' యూనిట్ ఏర్పాటుకు జరిగిన భూమి పూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2028 నాటికి భారతదేశానికి అవసరమైన 80 శాతం ఎయిర్ కండిషనర్లను (ఏసీ) ఏపీలోనే తయారు చేసే స్థాయికి ఎదుగుతామని ధీమా వ్యక్తం చేశారు.శ్రీసిటీ సాధించిన ప్రగతిని వివరిస్తూ... "సుమారు 8,500 ఎకరాల్లో విస్తరించి ఉన్న శ్రీసిటీలో 31 దేశాలకు చెందిన 250 కంపెనీలు తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇక్కడి నుంచి ఏటా 6 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఎగుమతులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 70,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. అందులో 50 శాతం ఉద్యోగాలు మహిళలకు దక్కడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయం" అని లోకేశ్ తెలిపారు. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ వరకు విభిన్న రంగాల్లో శ్రీసిటీ 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్'కు ప్రతీకగా నిలుస్తోందని, క్యారియర్ రాకతో ఈ ప్రగతి ప్రస్థానంలో మరో మైలురాయి చేరిందని ఆయన పేర్కొన్నారు. ఏపీని ఏసీ తయారీ రంగంలో అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంపై మాట్లాడుతూ.. "ఇప్పటికే 9 ప్రముఖ ఏసీ తయారీ కంపెనీలు, 30కి పైగా అనుబంధ పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. ఈ ఎకోసిస్టమ్‌లో సుమారు రూ. 12,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2027 నాటికి దేశంలోని 60% ఏసీలను ఇక్కడే తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పుడు క్యారియర్ రాకతో 2028 నాటికి 80% లక్ష్యాన్ని చేరుకుంటాం" అని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి క్లస్టర్ ఆధారిత వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు మంత్రి వివరించారు. "భవిష్యత్తు మొత్తం ఎకోసిస్టమ్స్, క్లస్టర్లదే. ఒక ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకులు, పరికరాల నుంచి పూర్తిస్థాయి తయారీ వరకు ఒకేచోట ఉండేలా వర్టికల్ ఇంటిగ్రేషన్‌తో పాటు, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ వంటి అంశాలతో హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌పైనా దృష్టి సారించాం" అని అన్నారు.

# 'తమిళనాట' సస్పెన్స్ థ్రిల్లర్

(మొదటి పేజీ తరువాయి)

లేదంటే అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే పార్టీకే తొలి ప్రాధాన్యత ఇస్తానంటారా? అనే విషయంలో ఎలాంటి స్పష్టత లేదు. ఇలాంటి సందిగ్ధావస్థలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవచ్చు అనే అంశంపై స్పష్టత కోసం న్యాయ నిపుణులతో గవర్నర్ సమావేశమయ్యారు. న్యాయ నిపుణులను లోక్ భవన్‌కు పిలిపించి, సుదీర్ఘంగా చర్చలు జరపడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాత్రి పదిన్నరగంటలదాకా ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది.

**ద్రవిడ పార్టీల మధ్య కుదరని సయోధ్య!**

విజయ్ పార్టీకి అధికారం దక్కకుండా చేయడమే లక్ష్యంగా ద్రవిడ పార్టీలు రహస్య చర్చలు జరిపాయని మీడియాలో వార్తలొచ్చాయి. డీఎంకే, అన్నాడీఎంకే ప్రతినిధుల బృందాలు లోతైన చర్చలు జరిపాయని తెలుస్తోంది. తాము ప్రభుత్వం ఏర్పాటుచేస్తామని అన్నాడీఎంకే ఆఫర్ చేయగా అందుకు డీఎంకే సమ్మతి తెలిపిందని, కానీ బయటి నుంచి మద్దతు ఇస్తామని డీఎంకే వెల్లడించినట్లు వార్తలొచ్చాయి. ప్రభుత్వంలో చేరితే ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తామని అన్నాడీఎంకే ఆఫర్‌చేసినట్లు తెలుస్తోంది. అందుకే ససేమిరా ఒప్పుకోబోమని, తప్పదనుకుంటే ప్రతిపక్షంలోనే కూర్చుంటామని డీఎంకే తెగేసి చెప్పడంతో అర్ధంతరంగా చర్చలు ముగిశాయని వార్తలొచ్చాయి.

**118 మంది మద్దతుతో వస్తే చూస్తాం: గవర్నర్**

అంతకుముందు బుధవారం ఉదయం నుంచి తమిళనాట పలు నాటకీయ పరిణామాలు సంభవించాయి. మంగళవారం రాత్రే మీకు మద్దతిస్తామని కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పేర్లను జతచేసి టీవీకే చీఫ్ విజయ్ తన కీలక పార్టీ నేతలతో కలిసి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు లోక్‌భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిశారు. విజయ్ వెంట టీవీకే ముఖ్యనేతలు బస్సీ ఎన్ ఆనంద్, ఆధవ్ అర్జున, కేఏ సెంగొట్టయాన్, సీటీ నిర్మల్‌కుమార్ తదితరలు ఉన్నారు. టీవీకే పార్టీలో 108 మంది ఎమ్మెల్యేలున్నా విజయ్ రెండుచోట్ల గెలవడంతో ఆ సంఖ్య 107కు తగ్గింది. వీళ్లకు కాంగ్రెస్‌లోని ఐదుగురి పేర్లను జతచేసి మొత్తం 112 పేర్లజాబితాను గవర్నర్‌కు విజయ్ సమరి?పంచి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. అందుకు గవర్నర్ సమ్మతి తెలపలేదు. 118 మంది ఎమ్మెల్యేలతో స్పష్టమైన మెజార్టీ వచ్చాక తిరిగి తన వద్దకు రావాలని విజయ్‌కు గవర్నర్ సూచించారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించారు. దీంతో నిరాశతో విజయ్ వెనుతిరిగారు. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించలేదన్న వార్త తెలీగానే అప్పటిదాకా ప్రమాణస్వీకారం కోసం స్టేడియంలో జరుగుతున్న సన్నాహక ఏర్పాట్లు హఠాత్తుగా ఆగిపోయాయి. అయితే కాంగ్రెస్‌కుతోడుగా అన్నాడీఎంకే సైతం టీవీకేకు మద్దతు పలకనుందనే వార్త వెనువెంటనే చక్కర్లు కొట్టింది. దీనిని అన్నాడీఎంకే కొట్టిపారేసింది. "ఇది పూర్తిగా అబద్ధం. ఏ రకంగా చూసినా మేం విజయ్ పార్టీకి మద్దతు ఇవ్వబోం. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి ఆదేశానుసారమే మా 47 మంది ఎమ్మెల్యేలు నడుచుకుంటారు"అని పార్టీ డెప్యూటీ జనరల్ సెక్రటరీ కేపీ మునుస్వామి స్పష్టంచేశారు.

# అధికారం దక్కలేదనే కేటీఆర్ ఆక్రోశం


(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: భవిష్యత్‌లో కూడా అధికారం దక్కదనే భయంతోనే కేటీఆర్ తీవ్ర నిరాశ, అసహనంలో తెలంగాణ ప్రజానీకం అసహ్యించుకునేలా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు రాజకీయ మైలేజీ కోసం మాటల దాడులకు దిగడం వారి నిస్సహాయతకు నిదర్శనమని మంత్రి విమర్శించారు. వరంగల్‌లో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రైతు సంక్షేమంపై చింత కాదు..పూర్తిగా రాజకీయ నిరాశ, ఆక్రోశానికి ప్రతిబింబమని ఘాటుగా వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కై, వారిపై ఈగ వాలనివ్వకుండా కాపాడుతూ అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే ప్రయత్నం..బీఆర్ఎస్ అసలు రాజకీయ స్వరూపాన్ని బయటపెడుతోందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. వరంగల్‌లో నిర్వహించిన సభ రైతు సంగ్రామ సదస్సుగా చెప్పడం పూర్తిగా అసత్యమని, అది బీఆర్ఎస్ ఆక్రోశ సభ మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. ఆ సమావేశానికి రైతులు రాలేదని కేవలం పార్టీ కార్యకర్తలే హాజరయ్యారని విమర్శించారు. రైతుల ప్రాణాలతో ఆటలాడినవారే ఇప్పుడు రైతు మిత్రులమంటూ మాట్లాడటం ప్రజలను మోసం చేయడమేనన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పంటల బీమా ఎత్తివేసి, వరదలు--వర్షాలతో నష్టపోయిన రైతులకు ఒక్క పైసా పరిహారం ఇవ్వలేదని చెప్పారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసి అప్పుల బారినుంచి బయటపడే అవకాశం లేకుండా చేసిందే బీఆర్ఎస్ అని మండిపడ్డారు. అందుకే రైతులే వారిని అధికారానికి దూరం చేశారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమంలో చరిత్ర సృష్టిస్తోందన్నారు. పంట నష్ట పరిహారం కింద ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందిస్తున్నామని, నెలకు సగటున రూ.5,500 కోట్లకు పైగా రైతుల కోసం ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకు రూ.2,533 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రెండేళ్లలోనే రైతుల కోసం లక్షా 5 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి, రైతు భరోసా, రుణమాఫీ, బీమా వంటి పథకాలతో రైతులకు నిజమైన అండగా నిలిచామని పేర్కొన్నారు. రైతు పేరుతో రాజకీయాలు చేసే రోజులు ముగిశాయని, తెలంగాణ రైతులు నిజాన్ని గుర్తించి తగిన సమాధానం ఇస్తారని మంత్రి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని హామీలను నెరవేర్చిందన్నారు.

Telangana

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## వైభవంగా అభయాంజనేయుని ప్రతిష్ఠా వేడుకలు

**- గణపతి పూజతో శాస్త్రోక్తంగా ప్రారంభమైన ఉత్సవాలు**

**- ఆధ్యాత్మికత ఉట్టిపడుతున్న ఆలయ ప్రాంగణం- నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ**



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల వేడుకలు తొలిరోజు గణపతి పూజతో మొదలయ్యాయి. వేద పండితులు చలివేదుల రాజేశ్వర శర్మ, జోషి మల్లికార్జున శర్మ బృందం శాస్త్రోక్తంగా క్రతువులను నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్వికరణం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అఖండ దీపారాధన చేసి దేవతా ఆహ్వానం పలికారు. సాయంత్రం జలాధివాసం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. గురువారం ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఇతర విగ్రహాల ప్రతిష్ఠా క్రతువులు ఉంటాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బెడిద నర్సిములు, జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు మేడిశెట్టి సత్యనారాయణ, సోమసాని రాజమల్లయ్య దంపతులతో పాటు భక్తులు భారీగా పాల్గొన్నారు.

## ముత్తమ్మ మృతి తీరని లోటు

**- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: సర్పంచ్ గార్ధస్ విక్రమ్**



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన మల్లం ముత్తమ్మ అనారోగ్యంతో కన్ను మూశారు. అందరితో కలుపుగోలుగా ఉండే ఆమె హఠాన్మరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. ఆమె మరణవార్త తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.గ్రామ సర్పంచ్ గార్ధస్ విక్రమ్ ముత్తమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటపెల్లి సిద్ధమ్మ యాదయ్య, బీఆర్ఎస్ కార్యదర్శి రవ్వ నర్సింహా, మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య యాదవ్, మల్లం వెంకటేష్, మల్లం శ్రీరాములు, కాటపెల్లి మహేష్, గర్ధాస్ శ్రీకాంత్, గర్ధాస్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రమశక్తి అవార్డు గ్రహీత మహేష్‌కు సన్మానం

**అభినందించిన ఎంపీడీవో నాగవేణి**



**తొలివెలుగు, రాజాపేట:** ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు తోటి కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తున్న ఇంజ మహేష్‌ను ఎంపీడీవో ఏ. నాగవేణి అభినందించారు. మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'శ్రమశక్తి' అవార్డు అందుకున్న మహేష్‌ను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృత్తి పట్ల నిబద్ధతతో పాటు సామాజిక బాధ్యత కలిగి ఉండటం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మహేష్ మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, జూనియర్ అసిస్టెంట్ సంపత్, కంప్యూటర్ ఆపరేటర్లు గణేష్, నరేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. తనను సత్కరించినందుకు మహేష్ ఎంపీడీవోకు కృతజ్ఞతలు తెలిపారు.


## రైతు సంక్షేమమే లక్ష్యంగా బ్యాంకింగ్ సేవలు

**- రేణికుంటలో రైతు వారోత్సవాల నిర్వహణ**

**తొలివెలుగు, రాజాపేట:** సాగు పనుల్లో రైతులకు బ్యాంకులు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని రేణికుంట పీఏసీఎస్ చైర్మన్ చింతలపురి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' రైతు వారోత్సవాల్లో భాగంగా బుధవారం రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), డీసీసీబీ రాజాపేట శాఖ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ రుణ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో రుణాలు చెల్లించి ప్రయోజనం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జన్నపల్లి బాలరాజ్ రెడ్డి, మదోత్ రాంజీ, పులి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిలివేరు బాలరాజు, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్, మండల వ్యవసాయ అధికారి (ఏఓ), ఏఈఓలు, సంఘ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.







## పంట వ్యర్థాలను కాల్చొద్దు.. నేలలో కలియదున్నాలి

**- రసాయన ఎరువుల వాడకాన్ని వీలైనంత తగ్గించాలి**

**- ప్రొద్దుటూరు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత**

**తొలివెలుగు, వలిగొండ:** నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే వ్యవసాయంలో అత్యంత కీలకమని, రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చివేయకుండా వాటిని భూమిలో కలియదున్నాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం వలిగొండ మండలంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏప్రిల్ 27 నుంచి మే 22 వరకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ప్రొద్దుటూరు గ్రామ రైతువేదికలో వ్యవసాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (రాజేంద్రనగర్) శాస్త్రవేత్తలు శ్రీలత, శ్రీధర్, శ్రీదేవి హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. పంటలో ఎరువుల యాజమాన్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా యూరియాను మోతాదుకు మించి అధికంగా వాడటం వల్ల పంటకు మేలు జరగకపోగా, చీడపీడల బెడద పెరుగుతుందన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సుస్థిర ఆదాయం సమకూర్చుకునే ఆధునిక మార్గాలను ఆమె రైతులకు వివరించారు. మరో శాస్త్రవేత్త శ్రీధర్ మాట్లాడుతూ.. రాబోయే వానాకాలం సీజన్‌లో సాగు చేయడానికి అనువైన ఎనిమిది రకాల మేలు జాతి వరి వంగడాల గురించి, వాటి దిగుబడి, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సవివరంగా తెలియజేశారు. పంటలకు పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు విధిగా వ్యక్తిగత రక్షణ చర్యలు తీసుకోవాలని, లేకుంటే అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్త శ్రీదేవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) అంజనీ దేవి, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) కళ్యాణి, ప్రొద్దుటూరు గ్రామ సర్పంచ్ దుబ్బ దానయ్య, ఏదులగూడెం సర్పంచ్ కొంతం శ్రీను తదితరులతో పాటు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో వెలుగులు

**- అర్హులందరికీ పక్కా గృహాలు అందించడమే లక్ష్యం**

**- ఒకటో వార్డు కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి**

**- లింగారెడ్డిగూడెంలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం**



**తొలివెలుగు, చౌటుప్పల్:** పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయని ఒకటవ వార్డ్ కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి తెలిపారు. బుధవారం లింగారెడ్డిగూడెం గ్రామంలో లబ్ధిదారురాలికి మంజూరైన నూతన ఇందిరమ్మ ఇంటిని ఆయన ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన బోదుల కౌసల్య నరసింహ కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయగా, నిర్మాణం పూర్తి చేసుకున్న ఆ గృహంలో కౌన్సిలర్ చేతుల మీదుగా గృహప్రవేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. సొంతిళ్లు లేని నిరుపేదలు ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఒకటవ వార్డ్ అధ్యక్షుడు సుర్కంటి వెంకట్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఊదరి యాదయ్య, బొమ్మిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆరుట్ల యాదయ్య, హౌసింగ్ ఏఈ కళ్యాణి, వార్డు ఆఫీసర్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ధరల సెగ.. సామాన్యుడి బతుకు భారమై!

**- రాజాపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నిరసన**

**- ఎన్నికలు ముగియగానే పెంచడం కేంద్రం కపట ప్రేమకు నిదర్శనం**

**- తక్షణమే ధరలు తగ్గించాలని డిమాండ్**



**తొలివెలుగు, రాజాపేట:** పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా బుధవారం రాజాపేటలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన జ్వాలలు మిన్నంటాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకు ధరలను నియంత్రించిన కేంద్రం, ఓట్ల ప్రక్రియ పూర్తికాగానే సామాన్యుడిపై భారాల మోత మోగించిందని మండిపడ్డారు. ఇది పేదలపై కేంద్రానికున్న కపట ప్రేమను స్పష్టం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన ధరలు ఆకాశాన్నంటుతుండటంతో రవాణా రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, దీని ప్రభావం నిత్యావసర సరుకులపై పడి సామాన్యుడు పూట గడవని స్థితిలో ఉన్నారని లింగం పేర్కొన్నారు. ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని గమనించి కేంద్రం తక్షణమే దిగిరావాలని, పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ విజ్ఞప్తులతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తరిగొప్పుల సిద్దులు, గంధమల రాజయ్య, గొల్లూరి రాములు, పాముకుంట రమేష్, గుంటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పింఛను రాక.. చూపు లేక..



**- కబోదిగా మారిన మాజీ సర్పంచ్ అభ్యర్థి దీనగాథ**

**- మూడు నెలలు తీసుకోలేదని ఆగిన 'ఆసరా'**

**- వృద్ధాప్యంలో తోడు లేక.. ఆకలి తీరక అవస్థలు**

**- కలెక్టర్ స్పందిస్తేనే జనార్ధన్‌కు విముక్తి**

**తొలివెలుగు, రాజాపేట:** ఒకప్పుడు ఊళ్లో పదిమందికి సాయం చేసే స్థాయి.. సర్పంచిగా పోటీ చేసిన నేపథ్యం.. కానీ విధి ఆడిన వింత నాటకంలో నేడు అతను కళ్ళు లేని కబోదిగా, వినికిడి శక్తి కోల్పోయిన దీనుడిగా మిగిలిపోయాడు. రాజాపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన పవర్‌లూమ్ కార్మికుడు మద్ది జనార్ధన్ (80), పరిస్థితి నేడు వర్ణనాతీతం. భార్య చనిపోయి, కుమార్తెలు అత్తారిళ్లకు వెళ్లడంతో పెంకుటింట్లో ఒంటరిగా నరకం అనుభవిస్తున్నాడు.

**ఆసరా దూరమై.. అంధకారమై:** బతుకుదెరువు కోసం భువనగిరి వెళ్లిన సమయంలో ఆయనకు ఆసరా పింఛను మంజూరైంది. అయితే, కాలక్రమేణా కంటి చూపు కోల్పోవడం, చెవులు వినపడకపోవడంతో భువనగిరికి వెళ్లి పింఛను తెచ్చుకోలేకపోయారు. వరుసగా మూడు నెలల పాటు నగదు తీసుకోకపోవడంతో సాంకేతిక కారణాలతో పింఛను నిలిచిపోయింది. కంటి చికిత్స కోసం స్థానికులు రూ. 60 వేలు పోగుచేసి ఆస్పత్రికి తీసుకెళ్లగా, నరాలు చచ్చుబడ్డాయని.. ఇక చూపు రాదని వైద్యులు తేల్చేశారు. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లాలో, ఎవరిని వేడుకోవాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఈ వృద్ధుడిని జిల్లా కలెక్టర్ మానవతా దృక్పథంతో ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


## కురుమ సంఘం దాతృత్వం

**- రాజయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత**



**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన బైకని రాజయ్య ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల కురుమ సంఘం నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సంఘం తరపున రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కురుమ సంఘం అధ్యక్షుడు దిడ్డిగ రమేష్, కుల పెద్దలు మీసా బాలయ్య, మీసా కిష్టయ్యల ఆధ్వర్యంలో ఈ నగదును అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆపద సమయంలో తోటి కులస్థుడి కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

## అరగంటలో.. అంతా అల్లకల్లోలం!





**- వడగండ్ల వానతో అన్నదాతకు తీరని కడగండ్లు**

**- నేలరాలిన వరి.. ధాన్యం కుప్పలు తడిసి ముద్ద**

**- మామిడి తోటల్లో నేల పరిచినట్లు కాయలు**

**- అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం**

**తొలివెలుగు, రాజాపేట:** ప్రకృతి కన్నెర్ర చేసింది.. అరగంట పాటు కురిసిన వడగండ్ల వాన అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో ఒక్కసారిగా మొదలైన ఈదురుగాలులు, వడగండ్ల బీభత్సానికి రాజాపేట మండలంలోని రైతులు కుదేలయ్యారు. కోతకు వచ్చిన వరి పంట నేలవాలగా, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే మట్టిపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**సింగారం, నర్సాపురంలో భారీ నష్టం:** ప్రధానంగా సింగారం పరిధిలో వందలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. ఐకేపీ కేంద్రాల్లో ఉన్న సుమారు 150కి పైగా ధాన్యం రాశులు వర్షానికి కొట్టుకుపోయాయి. నర్సాపురం ప్రాంతంలో మామిడి తోటల్లో కాయలు రాలి నేలంతా పరుచుకున్నాయి. అధికారులు, పాలకులు ధాన్యం సేకరణలో జాప్యం చేయడం వల్లే తమకు ఈ గతి పట్టిందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకునే తరుణంలో ఇలా జరగడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

## నేడు రైతులకు సౌర విద్యుత్‌పై అవగాహన సదస్సు

**- పి.ఎం. కుసుమ్ పథకంపై చౌటుప్పల్‌లో అవగాహన**

**- సబ్సిడీపై సోలార్ పంప్‌సెట్ల అందజేత.. ఏఈ సతీష్ వెల్లడి**



**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక రైతు వారం'లో భాగంగా గురువారం చౌటుప్పల్ క్లస్టర్ పరిధిలోని రైతులకు సౌర విద్యుత్ వినియోగంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. స్థానిక చౌటుప్పల్ క్లస్టర్ కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని విద్యుత్ శాఖ ఏఈ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పి.ఎం. కుసుమ్ పథకం గురించి రైతులకు వివరించనున్నారు. సోలార్ పంప్‌సెట్ల ఏర్పాటు విధానం, రైతులకు లభించే భారీ సబ్సిడీలు, సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడకుండా సౌర శక్తితో సాగునీటిని ఎలా పొందాలో నిపుణులు వివరించనున్నారు. క్లస్టర్ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఏఈ కోరారు.

## కళా ఉద్యమాల వేదిక.. ప్రజానాట్యమండలి మహాసభలు

**- జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేష్ పిలుపు - చౌటుప్పల్‌లో గోడపత్రాల ఆవిష్కరణ**



**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రజా సమస్యలను కళల ద్వారా వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో ఈ నెల 20న ఆలేరు పట్టణంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా మూడో మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేష్ తెలిపారు. బుధవారం చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభల గోడపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రజలను చైతన్యపరచడంలో ప్రజానాట్యమండలి ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజా కళలను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ మహాసభల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న కళాకారులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభల సందర్భంగా చైతన్య గీతాలు, నాటకాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. భవిష్యత్తు కార్యాచరణను ఇక్కడే రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, నారాయణపురం మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, మారగోని నాగరాజు, పల్లె గోపాల్ రెడ్డి, దాసరి అంజయ్యతో పాటు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్‌గా దామోదర్ రెడ్డి

**- హైకోర్టు ఆదేశాలతో తిరిగి పాత పాలకవర్గం కొలువు**

**- కోర్టు తీర్పుతో కొనసాగనున్న 2020 పాలకవర్గం**




**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా చింతల దామోదర్ రెడ్డి బుధవారం పునఃబాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) వెలువరించిన తీర్పు మేరకు ప్రభుత్వం పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని ఆదేశించడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి వై. రమేష్.. దామోదర్ రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. 2020లో ఎన్నికైన పాలకవర్గాన్నే తదుపరి ఎన్నికలు జరిగే వరకు కొనసాగించాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో, చైర్మన్‌తో పాటు సభ్యులుగా చెన్నగోని అంజయ్య గౌడ్, బోరెం నర్సిరెడ్డి, గుండెబోయిన రూపమ్మ మల్లయ్య, దుర్గ కృష్ణ, పబ్బతి వెంకటయ్య, దొడ్డి శ్రీశైలం, బొడ్డు పద్మ, సప్పిడి వెంకట్ రెడ్డి, బాతరాజు సాయిలు, పానుబోతు సూర, దౌడీ బాలరాజు, దుబ్బాక శశిధర్ రెడ్డి తదితరులు విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘం బలోపేతానికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## జల్సాల కోసం ట్రాక్టర్ల చోరీ.. కటకటాల్లో నిందితులు

**- వాహన తనిఖీల్లో పట్టుకున్న ఆత్మకూరు పోలీసులు**

**- రూ.లక్షల విలువైన ట్రాక్టర్, ద్విచక్ర వాహనం స్వాధీనం**

**- వివరాలు వెల్లడించిన ఎస్ఐ లక్ష్మీనారాయణ**

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** సులభంగా డబ్బు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశంతో ట్రాక్టర్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి అపహరణకు గురైన ట్రాక్టర్, ట్రాలీతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రహీమ్ ఖాన్‌పేట గ్రామానికి చెందిన కర్రె శ్రీశైలం మే 2న సాయంత్రం తన పొలం వద్ద ట్రాక్టర్ (టీఎస్ 30 ఎల్ 2511)ను షెడ్‌లో నిలిపి ఉంచగా, మరుసటి రోజు ఉదయం అది కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు మే 3న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో రేగు ఆనంద్ (45), కాల జోసెఫ్ కుమార్ (39)లను నిందితులుగా గుర్తించారు. మద్యానికి బానిసైన ఆనంద్‌కు గతంలో మోసం, కిడ్నాప్ కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో తిరిగి నేరాలకు పాల్పడుతున్నాడు. జోసెఫ్ కుమార్‌తో కలిసి ట్రాక్టర్లను దొంగిలించి విక్రయించి డబ్బు సంపాదించాలని పథకం పన్నారు. ఈ క్రమంలో మే 3న ఉదయం ట్రాక్టర్ వైర్లను జతచేసి స్టార్ట్ చేసి దొంగిలించి, తూర్పుగూడెంలో దాచినట్లు వెల్లడైంది. మరికొన్ని ట్రాక్టర్లు దొంగిలించి హైదరాబాద్‌లో అమ్మాలని యత్నించారు. అయితే మే 6 తెల్లవారుజామున మరో ట్రాక్టర్ దొంగిలించేందుకు వెళ్తుండగా, వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానంతో ఆపి విచారించగా నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ యాకూబ్, కానిస్టేబుళ్లు రాగం శ్రీను, విద్యాసాగర్, నిరంజన్, శ్రీనివాస్, ఎస్పీఓ విజయ్ తదితరులు కీలక పాత్ర పోషించగా, జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ మధుసూదన్ రెడ్డి వారిని అభినందించారు.

**పోలీసుల సూచనలు:** రైతులు ట్రాక్టర్లను పొలాల వద్ద ఉంచినప్పుడు బ్యాటరీలు తొలగించి సురక్షితంగా ఉంచాలని, ద్విచక్ర వాహనాలకు అదనపు తాళాలు వేయాలని, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

# దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం






**- ముఖ్య అతిథిగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**- యాదాద్రి జిల్లాలో 586 మందికి సహాయ ఉపకరణాల పంపిణీ**

**- దివ్యాంగుల రక్షకుడు రేవంత్ రెడ్డి: కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య**

**తొలివెలుగు, భువనగిరి టౌన్:** దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మహిళా శిశు, వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికలాంగుల కార్పొరేషన్ మరియు అలింకో (ఐవోసీఎల్ నిధులు) సంయుక్తంగా నిర్వహించిన ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జిల్లాలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, ఇంకా పరికరాలు రాని వారు ఆందోళన చెందవద్దని, ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగుల పక్షపాతి అని కొనియాడారు. రజనీ అనే దివ్యాంగురాలికి ఉద్యోగం ఇచ్చే ఫైలుపైనే సీఎం తొలి సంతకం చేశారని గుర్తు చేశారు. రిజర్వేషన్లు, వివాహ ప్రోత్సాహకాలు, పారా అథ్లెట్ దీప్తికి ప్రకటించిన భారీ నజరానా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 586 మందికి (కార్పొరేషన్ ద్వారా 68, అలింకో ద్వారా 518) ఉపకరణాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో




గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- చౌటుప్పల్ మార్కెట్ యార్డులో 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'**

**- మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**

తొలివెలుగు, చౌటుప్పల్: వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. బుధవారం మార్కెట్ యార్డు ఆవరణలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులకు అవసరమైన తార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, మాయిశ్చర్ మీటర్లు, ఆటోమేటిక్ వడ్లు పట్టే యంత్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. సాంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి, లాభదాయకమైన ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు.



వ్యవసాయంలో ప్రతిభ కనబరుస్తున్న పలువురు ఆదర్శ రైతులను ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మార్కెటింగ్ శాఖ ప్రగతి నివేదికను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్




మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నగొని అంజయ్య, ఏడిఏ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీశైలం

**- కార్యదర్శిగా బండ బీరయ్య ఏకగ్రీవ ఎన్నిక**

**- మండల మహాసభలో 11 మందితో నూతన కమిటీ**

**- ఉపాధి హామీ కూలీ రూ. 800 ఇవ్వాలని డిమాండ్**

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల పరిధిలోని కూరెళ్ల గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆత్మకూరు మండల మహాసభ బుధవారం ఉత్సాహంగా జరిగింది. ఈ మహాసభలో సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెల శ్రీశైలం, కార్యదర్శిగా బండ బీరయ్య ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి అధికారికంగా ప్రకటించారు. మహాసభలో వ్యవసాయ కార్మికులు, పేదల సమస్యలపై పలు





కీలక తీర్మానాలు చేశారు. జిల్లాలో నిలిపివేసిన భూ పంపిణీ ప్రక్రియను పునఃప్రారంభించాలని, సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ దినసరి కూలీని రూ. 800కు పెంచాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని దినాలను 200 రోజులకు పెంచాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు వంటి కనీస వసతులు కల్పించడంతో పాటు కూలీలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని తీర్మానించారు. అనంతరం 11 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా తుమ్మలగూడెం యాదయ్య, పొన్నం అండాలు, సహాయ కార్యదర్శులుగా కూరెల్ల నాగయ్య, గాజుల ఎల్లయ్య ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కూరెళ్ల యాదయ్య, పొనగాని బిక్షపతి, నాయిని పుల్లారెడ్డి, కన్నబోయిన అంజయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# రాజాపేటలో 'రియల్' మాయాజాలం


**- అనుమతులు నిల్.. వసూళ్లు వంద కోట్లు - గాల్లో కలిసిన 600 మంది సొంతింటి కల**

**- హైకోర్టు ఆదేశాలతో లేఅవుట్ రద్దు.. అయినా ఆగని విక్రయాలు - చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు**

**తొలివెలుగు, రాజాపేట:** సొంతింటి కలను నెరవేర్చుకోవాలని పైసా పైసా కూడబెట్టిన సామాన్యుల ఆశల మీద రియల్ ఎస్టేట్ వ్యాపారులు నీళ్లు చల్లారు. ఎలాంటి అనుమతులు లేని భూమిలో ప్లాట్లు చేసి, అమాయకులైన ప్రజల నుంచి ఏకంగా రూ.100 కోట్లకు పైగా వసూలు చేసిన భారీ మోసం రాజాపేట మండలం చల్లూరులో వెలుగుచూసింది. ప్రభుత్వ నిబంధనలను, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమంగా వెంచర్లు వేసి విక్రయిస్తున్నా.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**అసలేం జరిగిందంటే..**

రాజాపేట మండలం చల్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 322లో సుమారు 70 ఎకరాల 24 సెంట్ల విస్తీర్ణంలో కొందరు రియల్ వ్యాపారులు భారీ లేఅవుట్ వేశారు. ఇందులో శ్రీ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్, ఆర్.ఆర్ హై ఎనర్జెటిక్స్ లిమిటెడ్, శ్రీకర్ హోమ్స్ సంస్థలతో పాటు సీహెచ్. శ్రీకృష్ణ రాజేశ్వరి భాగస్వాములుగా ఉన్నారు. ఎలాంటి




డీటీసీపీ, ప్రభుత్వ అనుమతులు లేకుండానే 600 ప్లాట్లు చేసి విక్రయించారు.

**హైకోర్టు రద్దు చేసినా.. ఆగని దందా:**

ఈ అక్రమ లేఅవుట్‌పై ఫిర్యాదులు అందడంతో, హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ జరిపిన అధికారులు.. 2026 జనవరి 24న టీఎల్‌పీ నెంబర్ 112/2019 హెచ్ కింద ఈ లేఅవుట్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు లేఅవుట్ కాలపరిమితి ముగిసినందున రెన్యువల్ చేసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి గత ఏడాది మార్చి 20వ తేదీన సదరు నాలుగు కంపెనీలకు నోటీసులు జారీ చేశారు. అయినా ఆ సంస్థల నిర్వాహకులు స్పందించలేదు. పైగా తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ అబద్ధాలు చెబుతూ, మాయమాటలతో ప్లాట్ల విక్రయాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దీంతో ఇప్పటికే డబ్బులు చెల్లించిన 600 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# బన్నీపై శిరీష్ సరదా వ్యాఖ్యలు వైరల్

పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన అల్లు అర్జున్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారీ క్రేజ్‌ను సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా 'పుష్ప' సినిమాతో ఆయన స్థాయి మరింత పెరిగి, ఉత్తర భారతంలో కూడా విపరీతమైన అభిమానాన్ని సంపాదించాడు. దీంతో ఆయనతో సినిమా చేయడానికి పలువురు దర్శకులు ఆసక్తి చూపుతున్నారు.

ఈ నేపథ్యంలో ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ పాత వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఆయన తమ్ముడు అల్లు శిరీష్ చేసిన సరదా వ్యాఖ్యలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. గతంలో అలీ నిర్వహించిన 'అలీతో సరదాగా' కార్యక్రమానికి అతిథిగా హాజరైన అల్లు శిరీష్, తన అన్న గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. చిన్నప్పట్లో అల్లు అర్జున్కు చదువుపై పెద్దగా ఆసక్తి ఉండేదే కాదని సరదాగా వ్యాఖ్యానించాడు. రాత్రంతా చదివించినా ఉదయానికి మర్చిపోయేవాడని, పరీక్షల్లో కూడా అంతగా రాయడంలేదని చెప్పిన మాటలు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి.


అలాగే అన్నదమ్ముల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, తాను వేసుకునే కొత్త దుస్తులను ముందుగా బన్నీ వేసుకునేవాడని తెలిపాడు. తర్వాత తాను అదే దుస్తులు వేసుకుంటే అందరూ అది బన్నీదేనని అనుకునేవారని నవ్వుతూ చెప్పాడు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానుల్లో నవ్వులు పూయిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ ప్రస్తుతం తన తదుపరి చిత్రంతో బిజీగా ఉన్నాడు. 'పుష్ప 2' విజయానంతరం ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'రాకా'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన శీర్షిక ప్రకటన పోస్టర్‌లో బన్నీ లుక్ పూర్తిగా భిన్నంగా కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

## సుందర్ సి తప్పుకోవడానికి కారణం వెల్లడి



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా, ఉలగనాయకుడు కమల్ హాసన్ నిర్మాతగా రూపొందనున్న భారీ చిత్ర ప్రాజెక్ట్ నుంచి దర్శకుడు సుందర్ సి తప్పుకోవడానికి గల అసలు కారణాన్ని వెల్లడించారు. ఈ ఇద్దరు దిగ్గజాలు దశాబ్దాల తర్వాత ఒకే ప్రాజెక్ట్ కోసం కలిసివస్తుండటంతో ఈ సినిమా ప్రకటన సినీ ప్రపంచంలో భారీ ఉత్కంఠను రేకెత్తించింది. అయితే మొదట ఈ చిత్రానికి దర్శకుడిగా ఎంపికైన సుందర్ సి అనూహ్యంగా ప్రాజెక్ట్ నుంచి వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఈ నిర్ణయంపై స్పందించిన సుందర్ సి, ఇది ఎంతో పెద్ద ప్రాజెక్ట్ కావడంతో ఆ స్థాయి ఒత్తిడిని తాను సమర్థంగా నిర్వహించలేనని భావించానని తెలిపారు. స్టార్ డైరెక్టర్‌గా ఉన్నప్పటికీ తన పరిమితులను బహిరంగంగా అంగీకరించడం సినీ వర్గాల్లో అరుదైన విషయంగా భావిస్తున్నారు. గతంలో రజనీకాంత్తో కలిసి 'అరుణాచలం' వంటి భారీ విజయాన్ని అందించిన ఆయన, రజనీ ఇమేజ్‌ను బాగా అర్థం చేసుకున్న దర్శకుడిగా గుర్తింపు పొందారు. అయినప్పటికీ రజనీ-కమల్ లాంటి దిగ్గజాల కాంబినేషన్‌ను సమర్థంగా మలచడం చాలా క్లిష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇద్దరు అగ్ర నటుల అభిమానులను సంతృప్తి పరచడం, వారి ఇమేజ్‌లను సమతుల్యం చేయడం ఎంతో బాధ్యతతో కూడుకున్న పని అని వివరించారు. ప్రస్తుతం పాన్ ఇండియా ధోరణిలో ప్రతి అంశంపై భారీ అంచనాలు ఉంటాయని, చిన్న తప్పిదం జరిగినా సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు ఎదురవుతాయని తెలిపారు. అలాంటి ఒత్తిడి తన పనితీరుపై ప్రభావం చూపుతుందని ముందుగానే అంచనా వేసినట్లు చెప్పారు. రజనీకాంత్ యొక్క వాణిజ్య శైలి, కమల్ హాసన్ యొక్క సాంకేతిక ప్రమాణాలు — ఈ రెండింటినీ ఒకేసారి సమన్వయం చేయడం పెద్ద సవాల్ అని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక పెద్ద అవకాశాన్ని స్వీకరించడం కంటే, దానికి న్యాయం చేయలేనని భావించినప్పుడు గౌరవంగా తప్పుకోవడమే మంచిదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయాన్ని పలువురు సినీ విశ్లేషకులు వృత్తిపరమైన నిజాయితీగా అభినందిస్తున్నారు. మొత్తానికి ఈ ప్రాజెక్ట్ నుంచి సుందర్ సి తప్పుకోవడం ఒక సాహసోపేత నిర్ణయంగా నిలిచింది. అగ్ర హీరోలతో సినిమా అంటే అది కేవలం అవకాశం మాత్రమే కాకుండా భారీ బాధ్యత కూడా అని ఆయన తన నిర్ణయంతో స్పష్టంగా తెలియజేశారు.




# త్రిష లుక్‌తో అంచనాలు పెరుగుతున్నాయి


మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె పాత్ర రూపం పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష సంప్రదాయ వేషధారణలో దివ్యమైన ఆకర్షణతో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ఆమె పోషిస్తున్న 'అవని' పాత్ర కథలో కీలక మలుపులకు కారణమవుతుందని సమాచారం. కేవలం అందం కోసం మాత్రమే కాకుండా, కథను ముందుకు నడిపించే ప్రధాన శక్తిగా ఈ పాత్ర ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో చేసిన పాత్రలతో పోలిస్తే ఈ పాత్రలో ఎక్కువ భావోద్వేగ గాఢత, ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. ఇటీవలి కాలంలో ఎంపిక చేసిన చిత్రాలతో ముందుకు సాగుతున్న త్రిష కృష్ణన్కు 'విశ్వంభర' ఒక కీలక అవకాశంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో బలమైన పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక చిరంజీవి–త్రిష కృష్ణన్ కలయిక కూడా ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. గతంలో వీరిద్దరి మధ్య కనిపించిన అనుసంధానం ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఈసారి సోషియో ఫాంటసీ నేపథ్యంతో వారి పాత్రలు ఎలా ఉంటాయో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రానికి దర్శకుడు వశిష్ఠ భారీ స్థాయిలో రూపకల్పన చేస్తున్నారు. హాలీవుడ్ స్థాయి దృశ్య ప్రభావాలతో ఈ సినిమా ప్రత్యేకంగా ఉండనుందని సమాచారం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి కాగా, ప్రస్తుతం నిర్మాణానంతర పనులు వేగంగా కొనసాగుతున్నాయి. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా రూపొందుతోంది. విడుదల తేదీపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# 'కల్కి 2' షూట్‌పై తాజా వార్తలు



సైన్స్ ఫిక్షన్ చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులతో పాటు ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'కల్కి 2898 ఎడి' సీక్వెల్‌కు సంబంధించిన తాజా సమాచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే తొలి భాగంతో భారీ విజయాన్ని అందుకున్న ఈ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా రూపొందుతున్న రెండో భాగం ఎప్పుడు ప్రారంభమవుతుందా అన్న ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో, ఇటీవల అమితాబ్ బచ్చన్ చిత్రీకరణలో పాల్గొన్నారన్న వార్తలు వినిపించాయి. ఇప్పుడు మరో ఆసక్తికర సమాచారం వెలువడింది. ప్రభాస్ కూడా ఈ సీక్వెల్ షూటింగ్‌లో చేరినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాత్రి సమయంలో జరిగే చిత్రీకరణల్లో ఆయన పాల్గొననున్నట్లు సమాచారం. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్ కొనసాగనున్నట్లు వినికిడి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ఇక తొలి భాగంలో దీపికా పదుకొణె పోషించిన 'సుమతి' పాత్రకు సీక్వెల్‌లో ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఇంకా ఖరారు కాలేదని తెలుస్తోంది. అలాగే కమల్ హాసన్తో పాటు పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించే అవకాశం ఉందని సమాచారం.

# జాన్వీ ఆస్తులు వంద కోట్లు దాటాయా?



సినిమా రంగంలో తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించిన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రస్తుతం తన ఆస్తులు, పారితోషికం కారణంగా వార్తల్లో నిలుస్తోంది. కేవలం తొమ్మిది సంవత్సరాల సినీ ప్రయాణంలోనే ఆమె సంపాదించిన మొత్తం వంద కోట్ల రూపాయలకు పైగానే ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

అందాల తార శ్రీదేవి కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన జాన్వీ కపూర్ తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందింది. అనంతరం వరుసగా సినిమాలు చేసినప్పటికీ భారీ విజయాల కంటే పరాజయాలే ఎక్కువగా ఎదురైనట్లు విశ్లేషకులు చెబుతున్నారు. అయినప్పటికీ ఆమెకు ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదని చెప్పాలి. వాణిజ్య చిత్రాలతో పాటు మహిళా ప్రధాన కథలలో కూడా నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. నటనతో పాటు గ్లామర్ పరంగా కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇటీవలి కాలంలో ఆమె దక్షిణాది చిత్రాలపై దృష్టి సారించడం గమనార్హం.

తెలుగులో ఎన్టీఆర్తో కలిసి నటించిన 'దేవర' చిత్రంతో ఆమె టాలీవుడ్‌లోకి ప్రవేశించి మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రంలో పల్లెటూరి యువతిగా కనిపించనుంది.

పారితోషికం విషయంలో కూడా ఆమె ముందంజలోనే ఉంది. 'దేవర' చిత్రానికి సుమారు ఐదు కోట్ల రూపాయలు, 'పెద్ది' కోసం సుమారు ఏడు కోట్ల రూపాయలు తీసుకున్నట్లు సమాచారం. మొత్తంగా తక్కువ కాలంలోనే భారీ ఆస్తులు సంపాదించి ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటిగా జాన్వీ కపూర్ నిలుస్తోంది.